# త్రైలోక్యగీత

## దశమాధ్యాయము

## ఈషణా విమర్శయోగము

**త్రైలోక్యా ఉవాచ:-**

**దత్తావతార! హే స్వామిన్! సత్యజ్ఞాన సుధార్ణవ |**
**ప్రవృత్తిః కా? నివృత్తిః కా? కా వైషణోభయత్ర చ?||10.1||**

[త్రైలోక్య అడిగింది:-
ఓ స్వామి! దత్తావతారమా! సత్యమైన ఆధ్యాత్మిక జ్ఞానమనెడి దివ్యమైన అమృతపు మహాసముద్రమా! ప్రవృత్తి అంటే ఏమిటి? నివృత్తి అంటే ఏమిటి? ప్రాపంచిక జీవితంలోనైనా, ఆధ్యాత్మిక జీవితంలోనైనా బలమైన బంధాలేవి? ఏషణలు అనగా నేమి?]

**శ్రీశ్రీశ్రీ దత్తస్వామీ ఉవాచ:-**

**త్వం విజ్ఞానమితా నాసి, త్రైలోక్యే! సువిశాలధీః! |**
**దుష్ప్రవృత్తి రధశ్చాన్త్యా, మహా నివృత్తి రున్మదా ||10.2||**

[**శ్రీశ్రీశ్రీ దత్తస్వామి వచించారు:-**
ఓ త్రైలోక్య! నీవు చదివిన ఇంజనీరింగ్ (అనువర్తిత విజ్ఞానశాస్త్రము) వరకే కాక నీ మేధస్సు విశాలమైన వివేచనతో సత్యాన్వేషణ చేస్తున్నది. ప్రవృత్తికి క్రిందిస్థానంలో దుష్ప్రవృత్తి ఉంటుంది, ప్రవృత్తికి పై స్థానంలో నివృత్తి మరియు దాని పైన మహానివృత్తి అనబడే దివ్యమైన పిచ్చి ఉంటుంది.]

**ప్రవృత్తావసతో ధర్మే, జీవేఽనిత్య స్వరుత్ఫలమ్ |**
**భయభక్త్యా దుష్ప్రవృత్తిః, విపరీతా శుగంతిమా ||10.3||**

[ప్రాపంచిక జీవితంలో అంటే ప్రవృత్తిలో నీవు అధర్మమును వదిలి ధర్మము పక్షంలో నిలబడాలి. సమాజంలో నీతోటి జీవాత్మలందరితో నీ ప్రవర్తన 'ప్రవృత్తి' అనబడుతుంది. ప్రవృత్తికి దొరికే ఫలితం తాత్కాలిక స్వర్గము. అనిత్యమైన లేదా తాత్కాలికములైన జీవాత్మలకు సేవ చేస్తున్నావు కనుక తాత్కాలికంగా నీకు స్వర్గం దక్కుతుంది.

అధర్మమును అనుసరించి పాపము చేసినట్లైతే నరకమునకు పోవలసి వస్తుందనే భయంతోనో  లేక భగవంతుడు అంటే భక్తి తోనో నీవు పాపము చేయడానికి నిరాకరించాలి. (భగవంతుడు ధర్మమును ఇష్టపడతాడు, అధర్మమును ద్వేషిస్తాడు. భగవంతుని ఇష్టములే నీ ఇష్టములు కావాలి. తనకు అయిష్టమైనవి నీకు ద్వేషమును కలిగించాలి.). ప్రవృత్తికి వ్యతిరేకమైనది దుష్ప్రవృత్తి. ఇక్కడ ధర్మము ద్వేషించబడి అధర్మము ప్రేమించబడుతుంది. దీనికి పర్యవసానంగా ఈ లోకంలో దుఃఖము, పై లోకాల్లో నరకము తప్పవు. ]

**భక్తేర్నివృత్తి రఫలా, తత్ప్రవృత్తే స్స సత్ఫలా |**
**ప్రవృత్తిర్జగదాసక్తిః, నివృత్తిస్తత్ ప్రియైకగా ||10.4||**

[నివృత్తి అంటే భగవంతునితో నీ వ్యక్తిగత వ్యవహారము. దీనికి ఆధారము నీకు భగవంతుని కళ్యాణగుణముల పట్ల ఏర్పడిన అమితాకర్షణము. భగవంతుని నుండి బదులుగా ఏదీ కోరకుండా నీకు తన కళ్యాణగుణముల పట్ల ఏర్పడిన నిష్కామభక్తియే 'నివృత్తి'. (ఫలములను కోరుతూ భగవంతుని ఆరాధన(భక్తి) చేయడమే ప్రవృత్తి). నివృత్తి అంటే  భగవంతునితో ఏర్పడిన బంధము కారణముగా ప్రపంచంతో విడువడిన బంధము.

ఒకవేళ భగవంతునితో బంధము ఏర్పడకపోతే ప్రపంచముతో విడువడిన బంధము నిరర్ధకము. ఇక్కడ కావలసిన లక్ష్యము 'భగవంతునితో బంధము ఏర్పడటము', అయితే ఈ వైరాగ్య స్థితిని ప్రత్యక్షముగా చూసి భగవంతునితో భక్తిని నిర్ధారించలేము, కాబట్టి ప్రపంచములోని బంధాల నుండి జీవాత్మ విముక్తి పొందినదా లేదా అనే స్థితిని బట్టి భక్తిని నిర్ధారణ చేయవలసి ఉంటుంది, ఎలాగంటే నదిలో భూమి అడుగు నుండి నీటిలోతును లెక్కించాలంటే, పైకి కనిపించే స్కేలు పొడవు చూసినట్లు. (నది లోతును లెక్కించడానికి, పైన కనిపిస్తున్న స్కేలు పొడవును, మొత్తం స్కేలు పొడవు నుండి తీసివేస్తారు). ఇలా పరోక్షంగా ప్రపంచము నుండి ఎంత దూరమయ్యావు అనేదాన్ని బట్టి భగవంతునికి ఎంత దగ్గరైనావో తెలుస్తుంది అందుకే భగవంతునికి చేరువ అవ్వడాన్ని 'నివృత్తి' అంటారు, అంటే భక్తి ద్వారా ప్రపంచము నుండి పొందిన విముక్తియే నివృత్తి. ప్రవృత్తి అంటే ప్రత్యక్షముగా ప్రపంచముతో ఏర్పడి ఉన్న బంధము. నివృత్తి అనే పదము భగవంతునితో ఏర్పడిన బంధమును పరోక్షంగా వ్యక్తీకరిస్తుంది. అంటే నివృత్తికి ఆధారము భగవంతునిపై గల ప్రేమ లేదా భక్తి ఒక్కటే.]

**గోలోకాయ తురీయాంత్యా, స దాసః స్వపదోపరి |**
**దండభోగ బ్రహ్మ లోక - గోలోకా హి ఫలక్రమః ||10.5||**

[చివరిదైన నాలుగవ స్థానము మహానివృత్తి. నివృత్తి పైన గల మహానివృత్తి స్థితి భగవంతునిపై గల పిచ్చిప్రేమ, దీనికి పొందగల ఫలితము ఉత్కృష్టమైన గోలోకము. ఇది వైకుంఠము పైన ఉండే లోకము, ఇక్కడ భగవంతుడు స్వయంగా భక్తునికి పరిపూర్ణ సేవకుడుగా మారతాడు. దుష్ప్రవృత్తిలో నున్నవారికి చేసిన పాపములకు శిక్షయే కానుక. ప్రవృత్తిలోనున్న భక్తులకు తాత్కాలిక స్వర్గలోక నివాసము కానుక. నివృత్తిలోని భక్తులకు స్వయముగా భగవంతునితో బ్రహ్మలోక నివాసము అను వరము,

మహానివృత్తిలోని భక్తులకు భగవంతుడే స్వయముగా సేవకుడిగా గోలోకంలో మారడము వంటి అంతిమ ఫలితము భగవంతుని చేత కేటాయించబడుతుంది].

**సుబంధ ఏషణా హ్యస్య, తస్య వా ద్వివిధా బలాత్ |**
**ధర్మా ధర్మ పరా చాద్య, జాగ్రదున్మాదగా పరా ||10.6||**

[ఏషణ అంటే బలమైన బంధము. ఏషణ ప్రపంచముతో ఉంటే గనక అది దుష్ప్రవృత్తి, ప్రవృత్తిలతో కూడి ఉంటుంది. అంటే ప్రపంచముతో ధర్మబద్ధమైన దిశలో ఉండే ఏషణ 'ప్రవృత్తి'. అధర్మబద్ధమైన దిశలో ప్రపంచముతో బలంగా ఏర్పడిన ఏషణ దుష్ప్రవృత్తి. ఒకవేళ భగవంతునితో గనక ఏషణ ఏర్పడితే అది నివృత్తి, లేక మహానివృత్తి అను రెండు స్థాయిలలో ఉంటుంది. వివరించాలంటే, భగవంతునితో ఏర్పడిన ఏషణ ఊహించదగిన స్థాయిలో ఉన్నపుడు నివృత్తి అని, ఒకవేళ భగవంతునితో గల ఏషణ ఊహింప జాలనిది అయినపుడు మహానివృత్తి అనబడుతుంది. భక్తులు స్పృహలో ఉండి భగవంతునిపై చూపే భక్తి నివృత్తి అయితే, భగవంతునిపై గల ప్రేమ వారిలోని స్పృహను, ఇంద్రియనిగ్రహాల పరిధిని దాటి ఉన్మాదస్థితి లోకి ప్రవేశించిన భక్తియే మహానివృత్తి .]

**ప్రాయేణ యుజ్యతే లౌక్యే,**
**ధనదారాసుతక్రమా |**
**ధనం నిరర్థకం నో చేత్,**
**జీవ బంధాః సహాత్మనా ||10.7||**

[ సాధారణముగా 'ఏషణా' శబ్దమును ప్రాపంచిక బంధాల సందర్భములోనే ఉపయోగిస్తారు. ముఖ్యముగా ఇవి మూడు విధములు. ఈ మూడు ఏషణలను వాటికున్న ఆకర్షణ శక్తి యొక్క ఆరోహణక్రమములో చూస్తే 1. ధనేషణ (జీవునికి సంపదతో గల

బంధము), 2. దారేషణ (జీవునికి భార్య లేదా భర్తతో గల బంధము), 3. పుత్రేషణ (జీవునికి తమ సంతానంతో గల బంధము). ధనమునకు తనంతట తానుగా ఏ విలువ ఉండదు, జీవుడికి తన బంధాలు జీవించి ఉన్నప్పుడే తనకు ధనంతో ఆ బంధాలు నిలుపుకునే అవసరము ఏర్పడుతుంది. జీవితం ఉన్నంత వరకే ధనముతో బంధము ఉంటుంది, లేకుంటే లేదు. ఒకవేళ తనవారికి జీవితముతో బంధము లేకున్నా, లేక తనకే జీవితముతో బంధము లేకున్నా ధనము వట్టి నిరుపయోగమైన వస్తువు అవుతుంది. ]

**జీవబంధా ద్ధనం యోగే, నోక్తం ప్రాగుక్త హేతునా |**
**స్పష్టం ప్రియం ఫలత్యాగ - ద్రవ్య శక్త్యర్థ సేవయా ||10.8||**

[పైన చెప్పిన కారణము చేత, భగవంతునితో భక్తునికి గల దివ్య ప్రేమబంధమును అడ్డుకోగల బంధాలలో ధనమునకు స్థానము ఇవ్వబడలేదు. ఎందుకంటే కేవలం జీవించి ఉన్న బంధాలే, ఏ జీవునికైనా భగవంతునిపై పూర్తి భక్తిబంధము ఏర్పరుచుకునే మార్గంలో అడ్డొస్తాయి. జీవునికి ధనంతో గల ఏషణ యొక్క ప్రయోజనము అంతా కూడ తను జీవించడానికి, మరియు తనవారు జీవించి ఉన్నపుడు వారితో బంధాన్ని నిలుపుకోవడానికి ఉపకరించే సాధనముగా వాడటమే. సంపద అనేది కేవలం సంపాదించబడిన జడమైన వస్తువు మాత్రమే. ధనము అనేది, కేవలము త్యాగము కొరకు (కోరిన బంధాలకు), సేవ కొరకు (విస్తృతంగా ఏ బంధాలకైనా ), లేదా తాము ఖర్చుచేసిన శక్తికి ప్రతిగా పొందడము (వేతనము) కొరకు మారకముగా వాడ గల ఒక జడమైన అంశము.]

**ప్రవృత్తౌ త్రయ మగ్రస్థం, పితృద్దైవం నిరాకృతమ్ |**
**నివృత్తౌ తు ద్దైవమేకం, కలౌ సర్వత్ర దర్శనాత్ ||10.9||**

[ఈ మూడు (ఏషణాత్రయము) బంధములు జీవాత్మ పై ప్రవృత్తిలోను, నివృత్తిలోను బలమైన ప్రభావము చూపుతాయి. ఈ కలియుగములో నీవు ఎక్కడ చూసినా జీవులు తమ జీవిత భాగస్వామితోను, తమ సంతానముతోను బలమైన బంధము కలిగి ఉండి, అవినీతి మార్గాల ద్వారానైనా, వారి కొరకు సంపదను సమకూర్చుకొనుటకు ప్రేరణ పొందుతున్నారు. ఈ విధముగా ప్రవృత్తిలో ఈ మూడు ఏషణలు బలంగా పనిచేసిన జీవులలో తమ తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యము కలుగుతుంది. ప్రవృత్తిలో తల్లిదండ్రులు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడి దైవము అని చెప్పబడ్డారు. ఆధ్యాత్మిక జీవితములో మాత్రము భగవంతుడే మిగతా అన్ని ప్రాపంచిక బంధముల కంటే మిన్నగా నుండును.]

**ప్రహ్లాద శంకర త్యాగో, దైవాయైవ ప్రవృత్తితః |**
**మీరా రామానుజ త్యాగః, సిరియాళేన సంతతేః ||10.10||**

[ప్రహ్లాదుడు తన తండ్రిని వదలివేశాడు, శంకరాచార్యులు తల్లిని వదలివేశారు, మీరా తన భర్తను, రామానుజాచార్యులు తన భార్యను వదలివేశారు, శిరియాలుడు తన కొడుకును భగవంతుని కొరకే వదిలివేశాడు, ఈ త్యాగములు భగవంతుని కొరకే తప్ప ఇతర ప్రాపంచిక కారణాల కోసము కాదు. ]

**బుద్ధేన తు త్రయం త్యక్తం, ద్వాభ్యామేకత్ర పాపభాక్ |**
**అకామ్యాయ త్రయ త్యాగః, దుష్ప్రవృత్తిః పరద్వయే ||10.11||**

[బుద్ధుడు ధనమును, భార్యను, పుత్రుని భగవంతుని కొరకు వదలివేశాడు. దుష్ప్రవృత్తికి ఇక్కడ రెండు ఉదాహరణలు ఇవ్వబడ్డాయి. 1. జీవితభాగస్వామి కొరకు సంతానము కొరకు డబ్బు సంపాదించడానికి పాపకర్మలు చేయడము. 2. తన డబ్బును, తన

భార్యను, తన సంతానమును వదిలి పాపభరితమైన వేశ్యా కామమును పొందడము.]

**నరకద్వార తన్మార్గ- త్రయం లౌకిక పాప్మనా |**
**దైవజ్ఞౌ సర్వకష్టాని, భస్మైవ తన్మహత్తమమ్ ||10.12||**

[దుష్ప్రవృత్తులైన అనైతిక కామము, అనైతిక క్రోధము, అనైతిక లోభము అనునవి నరకమునకు ముఖ్యమైన మూడు ద్వారములు. ఇవి అత్యంత కఠిన శిక్షార్హములు. ఈ మూడు ఏషణలతో గుడ్డిగా పెంచుకున్న బంధములు నరకానికి మూడు దారులు. ఈ మూడింటిని భగవంతుని వైపు మరల్చినట్లైతే, భగవంతుని వైపు ప్రయాణించుటకు ఇవి బలమైన శక్తులుగా పనిచేస్తాయి. భగవంతుడు దివ్యమైన అగ్ని వంటి వాడు కనుక తనలో చేరిన ముళ్ళకర్రను మాడ్చి, నుదుటిపై ధరించగల పవిత్ర భస్మముగా మార్చగలడు. అంతటి భగవంతుని పవిత్రత ఊహలకు అందనంత ఉత్తమోత్తమము. కావున భగవంతుడు ద్వంద్వాతీతుడు, పాపపుణ్యాలకు అతీతుడు.]

**తప్తతామ్రాలింగనార్తాః, గోప్యః కృష్ణస్య చేత్ కృతిః |**
**మహానివృత్తి రున్మాదః, గోలోక ఫలమద్భుతమ్ ||10.13||**

[గోపికలు గనక తనను ప్రేమిస్తే నరకానికి పోవలసి వస్తుందని, బాగా ఎర్రగా కాల్చిన తన రాగి విగ్రహాన్ని కౌగిలించు కొనవలసి వస్తుందని శ్రీకృష్ణ భగవానుడు హెచ్చరించినారు. దీనికి గోపికలు, ఒకవేళ విగ్రహము కృష్ణునిదైతే చాలు, తాము తప్పక నరకానికి పోగలమని, బాగా ఎర్రగా కాల్చిన కృష్ణుని రాగి విగ్రహాన్ని ఇష్టముగా కౌగిలించు కొనగలమని సమాధానము ఇచ్చారు. మహానివృత్తి లోని భక్తుల స్థాయి ఇది. వీరు భగవంతుని పట్ల గుడ్డిగా, పూర్తిగా పిచ్చిభక్తిని కలిగి ఉంటారు. గోపికలకు తన పట్ల గల ఈ వివేచనారహితమైన భక్తిని

చూసి కృష్ణ భగవానులు చకితులైనారు. గోపికలకు 'గోలోకము' అనే అత్యుత్తమ ఫలితమును ఇచ్చారు.]

**నైష శారీరకః కామః, మనః ప్రేమ గుణోత్థితమ్ |**
**చుంబనాది కామ కార్యం, ప్రేమ కార్యం చ వా భవేత్ ||10.14||**

[గోపికలను పరిశీలించినట్లైతే, వారిలో కృష్ణుని పట్ల గల ఆకర్షణ, స్వాభావికముగా హార్మోన్ల కారణముగా పుట్టినది కాదు, శ్రీకృష్ణుని బాహ్య సౌందర్యమునకు ఆకర్షితమవడము చేత పుట్టిన మలినమైన కామము కాదు. అది పవిత్ర కామము. పవిత్ర ప్రేమ నుండి పవిత్రకామముగా రూపాంతరము చెందినట్టిది. ఇది అంతర్లీనమైన అపవిత్రకామమై, బాహ్యములో అపవిత్రకామముగా మారినది కాదు. కౌగిలించుకోవడము, ముద్దులు పెట్టడము, కామకేళి అనేవి ఆచరణాత్మక కామములోని మూడు స్థాయిలు. వీటికి మూలకారణము అపవిత్రమైన భావరూప కామము అయినా కావచ్చును లేదా శుద్ధమైన భావరూప ప్రేమ కూడా కావచ్చును.]

**ఏక కార్యం భిన్న హేతు, కామమృత్ ప్రేమహేమ వా|**
**అనిత్య నిత్య భేదేన, కార్యాత్ హేతు గుణో న హి ||10.15||**

[కేవలము కార్య ప్రభావమును చూసి మూలకారణము యొక్క స్వభావమును అంచనా వేయరాదు. కుండ అనునది ఒకే కార్య ప్రభావము అయినా దానిని మట్టితో చేయవచ్చును లేదా బంగారముతోనూ చేయవచ్చును. కుండ అనునది కేవలము ఒక విశేషమైన కార్య రూపానికి సంబంధించినది, అయితే దానికి ఒక మూలపదార్థము ఉండి ఉండాలి. కాని ఆ పదార్థము మట్టి కావచ్చును లేదా బంగారమూ కావచ్చును. అదే విధముగా 'కామము అను కార్యము' రూపాత్మకమైన కుండ వంటిది. ఈ కార్యమునకు మూలకారణము రెండు రకాలుగా ఉండవచ్చును. ఒకటి, హార్మోన్ల ప్రభావము చేత ప్రేరేపితమైన బాహ్యశరీరములో

అపవిత్ర భావరూప కామము కావచ్చును. రెండవది, అంతర్లీనమైన స్వభావము చేత శుద్ధమైన భావరూప ప్రేమ కావచ్చును. శరీరము తాత్కాలికమైనది కావున ఈ జన్మతో సమసిపోతుంది. కాని స్వభావములు శాశ్వతమైనవి, ఇవి ఆత్మను కూడి ఉండి జన్మ తర్వాత మరు జన్మలకు చేర వేయబడతాయి. కాబట్టి ఒక చర్య లేదా కార్య ప్రభావమును చూసి నీవు దాని పదార్థమూలము ఉన్నది అని గుర్తించగలవు కాని మూలకారణపు స్వభావమును నీవు తెలియలేవు. మట్టి కుండ (అపవిత్రమైన భావరూప కామము ఆధారమైన ఆచరణాత్మక కామక్రియ) తాత్కాలికమైనది, కాని బంగారు కుండ (శుద్ధమైన భావరూప ప్రేమ ఆధారమైన ఆచరణాత్మక కామ క్రియ) శాశ్వతమైనది. ]

**చతుర్దశా విభిద్యంతే, ఫలే చార్థే సహైషణాః |**
**అత్యధస్తోఽ త్యుత్తమాన్తాః, ఏషణార్థా విమర్శతః ||10.16||**

[ఏషణ అంటే బలమైన బంధము. ఇది నాలుగు స్థాయిలలో వేర్వేరు ఫలితాలను ఇవ్వగలదు.

1. ***దుష్ప్రవృత్తి***లో అధర్మముతో గల ఏషణ, జీవునికి తాత్కాలిక నరకలోకమును ఫలముగా ఇస్తుంది.

2. ***ప్రవృత్తి***లో ధర్మముతోనున్న ఏషణ, జీవునికి తాత్కాలిక స్వర్గలోకమును ఫలముగా ఇస్తుంది.

3. ***నివృత్తి***లో భగవంతునితో ఏర్పడిన ఏషణ (అవసరమైతే భగవంతునికి ఎదురుపడితే, ధర్మమును కూడా వదలగలగడము), జీవునికి భగవంతుని నివాసమును ఫలముగా ఇస్తుంది.

4.***మహానివృత్తి***లో భగవంతునిపై గల పిచ్చిప్రేమతో గల ఏషణ, భగవంతుని నివాసము పైన ఉన్న గోలోకమును ఫలముగా ఇస్తుంది.

కావున ఏషణ అను ఒక్క పదము దుష్ప్రవృత్తిలో చెడ్డదిగాను, ప్రవృత్తిలో ధర్మబద్ధమైనది గాను, నివృత్తిలో అదృష్టముగాను, మహానివృత్తిలో అనూహ్యమైన అదృష్టము గాను ఫలితాలను ఇస్తుంది. ఈ విధంగా ఏషణలు నీవు ఊహించలేని అధమస్థానము లోనికి నడుపగలవు, అలాగే ఊహించలేని ఉత్కృష్టమైన స్థానము లోనికి కూడా నడుపగలవు. ఈ విధముగా లోతైన విశ్లేషణ చేసి ఏషణ యొక్క లక్ష్యమును తెలిసి ఆయా ఏషణలు మంచివో, కావో నిర్ణయించగలవు.]

**తయా భాగవతాపార్థః, విదుషామపి దూషణే |**
**శుద్ధ దివ్యం హేతుకార్యం, విపరీతం పరం మతమ్ ||10.17||**

['ఏషణ' అను శబ్దార్థమును అపార్థము చేసుకున్న గొప్ప గొప్ప ఋషులు కూడా, ఏడు రోజులలో జీవాత్మకు మోక్షమునీయగల పరమ పవిత్ర గ్రంథమైన భాగవతమును అపార్థము చేసుకున్నారు. కొన్ని ఇతర మతములు అనుసరించెడి వారు కూడా ఇట్టి అపార్థము కారణముగానే భాగవత ఉద్గ్రంథమును విమర్శిస్తారు. శ్రీకృష్ణుడు గోపికల మధ్య దివ్యమైన శుద్ధప్రేమ వారి దివ్య శుద్ధప్రణయముగా రూపాంతరమైనదనే సత్యమును మనము గనక గ్రహించగలిగితే, వారి మధ్య ఉన్నది అపవిత్రమైన మృగకామము కాదని, జరిగినది అపవిత్రమైన మృగకలయిక లాంటిది కాదని తెలుసుకొంటాము, గోపికాకృష్ణుల రాసక్రీడ గురించిన మన అపోహలన్నీ పటాపంచలు అవుతాయి. ఈ క్రీడలో గోపికలు అనేక పూర్వజన్మల నుండి ఋషులు, స్వయముగా భగవంతుడే కృష్ణుడు, మూలకారణము (వారి మధ్య భావరూపప్రేమ), ప్రభావము (ఆచరణాత్మక కామము) అన్నీ

శుద్ధమైనవి, దివ్యమైనవి. కాని మిగతా అన్నిచోట్ల, మూలకారణము (భావరూప కామము హార్మోన్ల చేత జనిస్తుంది), ప్రభావము (ఆచరణాత్మక శృంగారము), ఈ రెండూ మృగాలలో సంభవించేవి మరియు అపవిత్రమైనవి.]

## ఉభయోః స్త్రిభి రౌన్నత్యం, ఫలస్యాపి తథోచితమ్ |
## ప్రవృత్తస్య విమర్శోఽయం, కల్పితస్య మయా న సః ||10.18||

[మహిమలను ప్రదర్శించడము, భగవద్గీత అనెడి అత్యద్భుత ఆధ్యాత్మిక జ్ఞానమును బోధించడము, భక్తులపైన అనూహ్య ప్రేమతో అత్యున్నతమైన గోలోకమును సృష్టించడము ద్వారా శ్రీకృష్ణుడు, సాక్షాత్ పరబ్రహ్మము అని నిరూపించబడినాడు. గోపికలు, మహోన్నతమైన ఆధ్యాత్మిక జ్ఞానముతో, కఠినమైన తపస్సాధనతో, శరణాగతితో భగవంతునికి సంపూర్ణ సమర్పణము అనే భక్తిమార్గమును స్థాపించి వారు దివ్యఋషులుగా నిరూపించ బడినారు. శ్రీ కృష్ణుడు భగవంతుడైనందున అత్యున్నతుడు, గోపికలు అత్యున్నతమైన భక్తులు, కావున భగవంతుడు వారికిచ్చిన బహుమానము కూడా అత్యున్నతమైన గోలోకము, ఇది భగవంతుని నివాసము కంటే పైన సృష్టించబడిన లోకము. ఇది పవిత్ర గ్రంథాలలో వ్రాయబడిన సత్యమైన సంఘటన, **నేను** చెప్పినదంతా యథార్ధ సంఘటనల విశ్లేషణయే. ఈ సంఘటన నేను కల్పించలేదు, యథార్థమైన సంఘటనలను సత్యమైన విశ్లేషణతో వివరించుటయే నా పద్ధతి. ]

## దేహార్పణ మతం భక్తేః, దూషితం చ ఫలోత్తమమ్ |
## సర్వబంధ చ్యుతిర్లింగాఽ - హంతయా చరమే భవే ||10.19||

[భక్తులైన ఋషులు మూర్ఖులని అనుకోరాదు. ఒక దివ్యమైన పద్ధతిని ప్రతిష్ఠించి, దాని ద్వారా సంపూర్ణ త్యాగము అను

మార్గములో, శరీరము కూడా భగవంతునికి అర్పితం చేయాలని తలచి, తమ అద్భుతమైన తపశ్శక్తితో స్త్రీలుగా మారి, భగవానుడైన శ్రీరాముని కౌగిలించుకోవాలని ఋషులు అనుకున్నారు. కావున వారు నిజమైన స్త్రీలు, గోపికలుగా పుట్టి, వారి శరీరమును భగవంతునికి అర్పించగలిగారు. నిజానికి గోపికలు సృష్టించి, అనుసరించినట్టి ఈ ప్రత్యేకమైన భక్తిమార్గం తొలుత భగవంతునిచే వ్యతిరేకించబడినది. అయినా తన సలహాను పెడచెవిని పెట్టినందుకు, భగవంతుడు వారిని నరకంలోకి త్రోయకుండా, వారి పాపాలన్నీ తనపైకి తీసుకుని, వారికి ఉత్కృష్టమైన ఫలితమును ఇచ్చాడు. ఈ ఆచరణాత్మక సత్యము, పరోక్షంగా వారి సంపూర్ణ సమర్పణము భగవంతునిచే ఎంతగానో ప్రశంసించబడిందని గమనించవచ్చును. కావున మహానివృత్తి లేదా మధురభక్తిని, అవలంబించే క్రమంలో జీవులకు ఎన్నో అడ్డంకులు ఉన్నప్పటికీ, చివరికి ఉత్కృష్టమైన ఫలితాలనిస్తుంది. ఇక్కడ జీవాత్మకు జీవిత భాగస్వామితో గల బంధము (దారేషణ) , భగవంతునితో భక్తునికున్న బంధం ముందు ఓడిపోయింది. ఋషులు గత అనేక జన్మల నుండి మొత్తము ప్రాపంచిక బంధాలను భగవంతునికి సమర్పించి, సర్వస్య శరణము చేసిన కారణంగా, వారు చిట్టచివరన స్త్రీ జన్మలు పొంది, దారేషణమును జయించి భగవంతునితో బంధం పటిష్ఠం చేసుకోవటము ద్వారా వారి స్వాభావికమైన పురుషాహంకారముతో సహా సంపూర్ణ అహంకారమును తొలగించుకున్నారు. ]

**చతుర్భిర్ న హి కామోఽస్య, తత్ పరీక్షా స్వచారుతా|**
**నిశిత జ్ఞాన యోగేన, సత్యభక్తి రపభ్రమః ||10.20||**

[శ్రీకృష్ణ భగవానుని యందు అపవిత్రమైన కామమును ఆపాదించలేరు, ఎందుకంటే కృష్ణుడు బృందావనమును వదిలి వెళ్ళిన తర్వాత జీవితంలో మళ్ళీ ఎక్కడ కూడా, ఎవరితో కూడా ఇలా ప్రవర్తించలేదు. (తనను గాఢంగా ప్రేమించిన

పదహారువేల మంది రాకుమార్తెలను కూడా పెళ్ళి చేసుకున్నాడు.). బృందావనమునకు తిరిగి ఎప్పుడూ గోపికల పొందుకొరకు రాలేదు, పైగా అర్ధరాత్రి తన చేరువకు వచ్చిన గోపికలను ఇళ్ళకు వెళ్ళి పొమ్మని బెదిరించాడు. ప్రాపంచిక జీవితంలో ధర్మమును పరిరక్షించడానికి, వేరెవ్వరూ ఇలా హద్దు మీరకుండా ఉండటానికి, గోవర్ధన పర్వతమును తన చిటికెన వేలుతో ఎత్తి, తాను అందరిలాంటి మానవుని (ధర్మము పరిధిలోకి వచ్చే వాడు) కానని, సాక్షాత్తు భగవంతుడనని బోధించారు. శ్రీకృష్ణుడు అంతటి సౌందర్యరూపమును ధరించినది గోపికలను ఆకర్షించి, అపవిత్రమైన కామం పొందడం కొరకు కాదు, వారిని పరీక్షించడానికి. గోపికలు తన బాహ్య సౌందర్యము చూసి కామాతురులు అవుతారా? లేక అంతర్లీనమైన ప్రేమ కారణంగా ప్రేమిస్తారా? అని తెలియుట కొరకు. భగవంతుడు సర్వజ్ఞుడైన కారణంగా వారి అంతరంగములోని భావనల సత్యము తెలిసినవాడు. ఆధ్యాత్మిక జ్ఞానము భక్తిని కలుగజేస్తుంది. ఒకవేళ లోతైన ఆధ్యాత్మిక జ్ఞానము లేకుండా జనించిన భక్తి పలు అపోహలతో కూడి ఉంటుంది. పరమ పవిత్రమైన భాగవత గ్రంథములో, ఈ అంకము లోని ఆధ్యాత్మిక జ్ఞాన విశ్లేషణ అపోహలన్నీ తొలగించి శ్రీకృష్ణ భగవానుని యందు సత్యమైన భక్తిని కలిగిస్తుంది.]

**ఇతి త్రైలోక్యగీతాయాం 'ఏషణా విమర్శయోగో' నామ దశమాధ్యాయః ||**

**ఈ విధంగా త్రైలోక్యగీత యందు పదవ అధ్యాయము అయిన 'బలమైన బంధాల విచారణ యోగము' పూర్తి అయినది.**